క్లుప్తంగా

వీధి దీపాలు వెలగక ఇక్కట్లు



అన్నవరం(జగ్గయ్యపేట): మండలంలో నిఅన్నవరంలో కొద్దిరోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో గ్రామం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణ సరిహద్దులో ఉండే మారుమూల గ్రామంలో రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనులపండువగా స్వామివారి కల్యాణం



నందిగామరూరల్: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి వారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణలో పలురకాల పుష్పాలు, విద్యుద్దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మంటపంలో స్వామి వారి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణ క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చావా అర్జునరావు, అర్చకుడు బాలశాస్త్రి, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి తీరుతో విద్యార్థులకు తీరని నష్టం

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో పేద విద్యార్థులతోపాటు విద్యారంగానికి తీరని నష్టం వాటిల్లుతోందని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రాథమికోన్నత(యూపీ) పాఠశాలల విలీనం పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా పేద విద్యార్థులకు తీరనినష్టం వాటిల్లుతోందన్నారు. యూపీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

బడి బస్సులు భద్రమేనా?

- నిబంధనలు పాటించని పలు పాఠశాలల యాజమాన్యాలు..
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

నందిగామరూరల్: వేసవి సెలవులు ముగిశాయి..వారంరోజులుగా చిన్నారులు ఆయా పాఠశాలలకు వెళ్తున్నారు. నందిగామ పట్టణంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలను నందిగామలోని పాఠశాలలకు పంపిస్తున్నారు. విద్యార్థులు నిత్యం సుమారు 20 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల మేర ప్రయాణించి విద్యాసంస్థలకు వెళ్తున్నారు. అయితే తమ పిల్లలు వెళ్తున్న ఆటోలు, ఆయా విద్యాసంస్థల బస్సుల కండిషన్‌పై తల్లిదండ్రులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులు..

నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట పట్టణం మండలంలోని ఆయా గ్రామాల్లోని విద్యా సంస్థలకు చెందిన బస్సులు సుమారు 270కు పైగా ఉన్నాయి. వీటిలో మెజార్టీ విద్యాసంస్థలకు చెందిన బస్సుల యాజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు పాటిస్తున్నప్పటికీ కొన్ని యాజమాన్యాలు మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయనే ఆరోపణలు సర్వత్రా నెలకొన్నాయి. ముఖ్యంగా పాఠశాల బస్సుల సామర్థ్యం, బస్సుల్లోని సీట్లకు మించి విద్యార్థులను ఎక్కిస్తూ రాకపోకలు సాగిస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా జరగరాని జరిగితే తమ బిడ్డల రక్షణ పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి.



ప్రైవేట్ పాఠశాల బస్సు

నిబంధనలు పాటించేలా చూడాలి...

పాఠశాలలకు చెందిన బస్సులకు మోటారు వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రశీదు, పొల్యూషన్, కంట్రోల్ సర్టిఫికెట్ ఉండేలా ఆర్‌టీఓ అధికారులు విధిగా తనిఖీలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. బస్సుల నిర్వహణలో పాఠశాలల యాజమాన్యాలు మోటార్ వాహన చట్టాన్ని పాటించేలా ఆశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఆర్డీవో బాలకృష్ణ, అధికారులు, విద్యార్థులు



జగ్గయ్యపేటలో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, చైర్మన్ రాఘవేంద్ర, విద్యార్థులు

నందిగామటౌన్/నందిగామరూరల్:యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు, విద్యార్థులతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆర్డీవో బాలకృష్ణ, కమిషనర్ లోవరాజు, తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని కమ్మ కల్యాణ మండపంలో నందిగామ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. మాజీ ఏపీపీలు ఈశ్వరప్రగడ రంగారారావు, యర్రమరెడ్డి బాబురావు జిల్లా కోర్టు ఏవో విజయలక్ష్మి, సూపరింటెండెంట్ జ్యోతి, న్యాయవాదులు పాల్గొన్నారు. నందిగామ సబ్‌జైలు ఆవరణలో జిల్లా జైలర్, ఇన్‌చార్జ్ జిల్లా సబ్‌జైలు అధికారి వజ్జా ఉమామహేశ్వరరావు, జైలు అధికారులు, ముద్దాయిలతో కలిసి యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. అదేవిధంగా కంచికచర్ల, చందర్లపాడు, నందిగామ మండలాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు యోగసనాలు వేశారు.



పెనుగంచిప్రోలులో టార్పాలిన్ పట్టాలు లేకపోవడంతో కటిక నేలపై యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ డి.తులసి వెంకటకృష్ణారావు, తహసీల్దార్ మనోహర్, సీఐ పి.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. అదేవిధంగా జగ్గయ్యపేట కోర్టు ఆవరణలో సూపరిండింటెంట్ రవి ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ కోచ్‌లు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి ఆధ్వర్యంలో పాలేటిలో జల యోగాసనాలు వేశారు. బీజేపీ ఆధ్వర్యంలో బుద్ధ విహార్ వద్ద యోగా దినోత్సవం నిర్వహించారు. అదేవిధంగా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండల కేంద్రాలు, గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్

వత్సవాయి : మండలంలో మిర్చి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్న వైనంపై ఈనెల 19న 'సాక్షి' దినపత్రికలో 'మంటెత్తిస్తున్న మిర్చి విత్తనం ధరలు' శీర్షికన ప్రచురించిన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. జగ్గయ్యపేట ఏడీఏ భవానీ శనివారం వత్సవాయిలోని విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్ట్రార్, రశీదు పుస్తకాలు, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ భవాని మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధికరేట్లకు విత్తనాలను అమ్మితే చర్యలు తీసుకుంటామని విత్తన దుకాణాల యజమానులను హెచ్చరించారు. పత్తి విత్తనాలు ప్యాకెట్ ఎమ్మార్పీ ధర రూ.901 ఉన్నందున అదే ధరకు విక్రయించాలని స్పష్టం చేశారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే ఆయాషాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ తనిఖీల్లో జగ్గయ్యపేట టెక్నికల్ ఏవో వి.రవికుమార్, వత్సవాయి ఏవో జి.సత్యనారాయణ, సిబ్బంది రాకేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



వత్సవాయిలో విత్తన దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ భవాని

సురేష్ మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు : తన్నీరు

పెనుగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యానాల సురేష్ మృతి పార్టీకి తీరని లోటు అని జగ్గయ్యపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. సురేష్ సంస్మరణ సభ శనివారం స్థానిక మునేరు అవతల స్నేహ గార్డెన్స్‌లో నిర్వహించారు. సురేష్ చిత్రపటం వద్ద తన్నీరుతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా, నాయకుడిగా గ్రామంలో పార్టీ అభివృద్ధికి సురేష్ ఎనలేని సేవలందించారని కొనియాడారు. సంస్మరణ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, రైతువిభాగం జిల్లా అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి పృథ్వీ, ఎస్సీసెల్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కీసర లోకేశ్వరరావు, దేరంగుల శ్రీనివాసరావు, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు చేని రాంబాబు, జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ పాల్గొని సురేష్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



యానాల సురేష్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న తన్నీరు, పక్కన నాయకులు

ప్రభుత్వ బాలికల కళాశాలను సద్వినియోగం చేసుకోండి

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కె.హేమమాధవి శనివారం కోరారు. విద్యార్థులకు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యనందించడంతోపాటు యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం వర్తిస్తుందన్నారు. ఐఐటీ, ఎంసెట్ బుక్స్ అందజేస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ బాలికలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరారు.

వైభవంగా నాగసత్తెమ్మ ఆలయ వార్షికోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ సమీపంలోని విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్ వారి జగ్గయ్యపేట లైమ్ స్టోన్ మైన్స్(జేఎల్ఎం) క్వార్టర్స్ వద్ద వేంచేసియున్న శ్రీనాగసత్తెమ్మ అమ్మవారి ఆలయం 14వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు టీఎల్ఎన్ ఆచార్యులు, సంపత్ జానకీరామ్ కలిసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. స్టీల్ ప్లాంట్ పూర్వ ఉద్యోగ అధికారి శాస్త్రి, లక్ష్మి దంపతుల ఆర్థికసాయంతో చింతా శివయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి చండీ హోమం నిర్వహించగా, జేఎల్ఎం ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్, వి.ఆంజనేయులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకారంలో నాగసత్తెమ్మ అమ్మవారు